ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.2 । కనిష్ఠం 19.6



మైనార్టీ రెసిడెన్షియల్ స్కూళ్లలో పిల్లలను చేర్పించాలి

లింగంపేట, జనవరి 24: మండలంలోని ప్రభుత్వ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో పిల్లలను చేర్పించేలా గ్రామ కార్యదర్శులు కృషి చేయాలని ప్రిన్సిపాల్ వెంకట రాములు కోరారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మైనార్టీ పాఠశాలలో 5,6,7,8 తరగతులలో, ఇంటర్ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న అడ్మిషన్ల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. గ్రామాల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీవో సురేందర్, ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డిలోని విద్యాశాఖ కార్యాలయం

అంతా.. మా ఇష్టం!



- జిల్లా విద్యాశాఖలో అధికారుల ఇష్టారాజ్యం
- అదనపు బాధ్యతల పేరుతో సొంత పనులు
- పాఠశాలలను గాలికి వదిలేసి విద్యాశాఖ కార్యాలయంలోనే మకాం
- పాఠశాలలో ఓ రిజిష్టర్, విద్యాశాఖ కార్యాలయంలో మరో రిజిష్టర్
- ఎక్కడ వీలుంటే అక్కడ సంతకాలు
- పైగా విద్యాశాఖలో అన్ని విషయాల్లో పెత్తనం
- ఏళ్ల తరబడి వాళ్లకే ఆ పోస్టుల అప్పగింత
- మూడేళ్లు దాటినా ఆ సిబ్బందికే అదనపు బాధ్యతలు
- విద్యాశాఖ అధికారుల తీరుపై విద్యార్థి సంఘాలు, పలువురు ఉపాధ్యాయుల మండిపాటు
- వెంటనే ఆయా పోస్టులల్లో తిష్టవేసిన వారిని మార్చాలని డిమాండ్

కామారెడ్డి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖలోని కొందరు అధికారులు, సిబ్బంది తీరు ప్రతీసారి వివాదాస్పదం అవుతున్న వారిపై చర్యలకు మాత్రం ఉన్నతాధికారులు పూనుకోవడం లేదనే వాదనలు సొంత శాఖలోని ఉపాధ్యాయుల నుంచే కాకుండా విద్యార్థి సంఘాల నాయకుల నుంచి వినిపిస్తున్నాయి. తమకు కేటాయించిన పాఠశాలలను, విద్యార్థులను గాలికి వదిలేసి విద్యాశాఖ కార్యాలయంలోనే కొందరు సిబ్బంది అదనపు బాధ్యతల పేరుతో తిష్ట వేయడంపై ఉన్నతాధికారులు ఏ మాత్రం దృష్టి సారించకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.. ఒకవేళ ఆయా సిబ్బందికి అదనపు బాధ్యతలు అప్పజెప్పితే ఆ సమయంలోనే హాజరై తిరిగి పాఠశాలలకు వెళ్లాల్సి ఉన్నా విద్యాశాఖ కార్యాలయంలోనే తిష్టవేస్తున్నారని పైగా ఏ శాఖలో లేని విధంగా విద్యాశాఖ కార్యాలయంలో ఓ రిజిష్టర్, పాఠశాలలో మరో రిజిష్టర్ మెయింటెనెన్స్ చేయడం ఒక్క విద్యాశాఖలోనే చెల్లుబాటు అవుతుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎవరైనా ఉన్నతాధికారులు వస్తే తప్పించుకునేందుకు ఈ తరహా ఆలోచన చేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ సిబ్బంది తమ విధులను పక్కన పెట్టి ఇతర విషయాల్లో పెత్తనం చెలాయిస్తున్నారని ఏదైన అంశంపై ఫిర్యాదు వస్తే చాలు వారు మనవారని చెబుతూ విద్యాశాఖాధికారిని సైతం తప్పుదోవ పట్టిస్తూ విచారణ చేయకుండా అడ్డుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి. పైగా ఇలాంటి వారికే విద్యాశాఖ ఉన్నతాధికారి అండగా ఉంటున్నారంటూ విద్యార్థి, ఉపాధ్యాయ సంఘం నుంచి ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

పాఠశాలలో ఓ రిజిష్టర్.. విద్యాశాఖ కార్యాలయంలో మరో రిజిష్టర్

సాధారణంగా ఏ ఉద్యోగికైన ఒకే చోట హాజరుకు సంబంధించిన రిజిష్టర్‌ను మెయింటెనెన్స్ చేస్తుంటారు. కానీ జిల్లా విద్యాశాఖలో మాత్రమే రెండేసి రిజిష్టర్‌లు మెయింటెనెన్స్ చేస్తున్నారని సమాచారం. రెండ్రోజుల క్రితం 'ఆంధ్రజ్యోతి'లో 'డుమ్మా మాస్టర్లు' అంటూ ప్రత్యేక కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. పలువురు విద్యార్థులు, తలిదండ్రులు ఈ విషయం అక్షర సత్యమని విద్యార్థి సంఘాల దృష్టికి తీసు కురావడంతో వారు పలు ప్రభుత్వ పాఠశాలను పరిశీలించగా కామారెడ్డి పట్టణంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సరిగ్గా విధులకు హాజరుకావడం లేదని విద్యార్థి సంఘ నాయకులు గుర్తించారు. సదరు ప్రధానోపాధ్యాయుడి రిజిష్టర్‌ల బాగోతం బయటకు వచ్చింది. పాఠశాలకు నెలల తరబడి హాజరుకావడం లేదని పాఠశాలలో రిజిష్టర్‌లో హాజరైనట్టు సంతకాలు సైతం లేవని విద్యార్థిసంఘ నాయకులు తెలిపారు. సదరు ప్రధానోపాధ్యాయుడికి పరీక్షల విభాగం అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారని ఆ బాధ్యతలను కేవలం పరీక్షల సమయంలోనే నిర్వహించాల్సి ఉన్నా పూర్తిస్థాయిలో విద్యాశాఖలోనే మకాం వేస్తున్నాడని పాఠశాల వైపు కన్నెత్తి చూడడం లేదని ఆరోపించారు. పైగా విద్యాశాఖ కార్యాలయంలో మరో రిజిష్టర్‌ను పెట్టి మరీ సంతకాలు చేస్తున్నట్లు తెలిసింది. ఇక్కడ సంతకాలు చేస్తున్నప్పుడు పాఠశాల రిజిష్టర్‌లో సదరు ప్రధానోపాధ్యాయుడి పేరు ఎందుకు ఉంచారనే దానిపై విద్యాశాఖ ఉన్నతాధికారులు వివరించకపోవడం విడ్డూరంగా ఉంది.

ఏళ్ల తరబడి ఒకరిద్దరికే పోస్టుల అప్పగింత

విద్యాశాఖలో ఏళ్ల తరబడి ఒకరిద్దరు ఉపాధ్యాయులకు పోస్టులు అప్పగిస్తున్నారని అందులో డీఎస్‌వో, ఏజీఎఫ్, డీసీఈబీ పోస్టులలో కొందరు ఉపాధ్యాయులు సంవత్సరాలుగా పాతుకుపోయారని వాళ్లనే కొనసాగించడంలో ఆంతర్యమేమిటో జిల్లా ఉన్నతాధికారులకే తెలియాలి. ప్రతిరోజూ విద్యాశాఖ కార్యాలయంలోనే ఆ శాఖ ఉన్నతాధికారి ముందే మెలుగుతున్నప్పటికీ ఉన్నతాధికారి ప్రశ్నించకపోవడం ఏమిటని సొంత శాఖలోనే చర్చసాగుతోంది. ఆయా పోస్టులకు రెండు నుంచి మూడు సంవత్సరాలు మాత్రమే అదనపు బాధ్యతలు కేటాయించిన అధికారుల సేవలనువిని యోగించుకోవాల్సి ఉండగా ఆ శాఖలో మరెవరు లేరనే ధోరణిలో ఉన్న వారినే ఏళ్ల తరబడి కొనసా గిస్తున్నామని ఆ శాఖ అధికారులు చెప్పుకు రావడం సదరు సిబ్బందికి సహకరిస్తున్నారని అర్థమవుతోంది. అసలు తన సబ్జెక్ట్ స్థాయికి సంబంధం లేకుండా పై తరగతులకు సంబంధించిన ప్రోగ్రాంలను నిర్వహించడం విద్యాశాఖలోనే కొనసాగుతుండడం కొసమెరుపు. వీరంతా అదనపు బాధ్యతలు పేరుతో తమ సొంత పనులకు సమయం ఎక్కువగా కేటాయిస్తున్నారని, రియల్ ఏస్టేట్, పైరవీలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఆ ప్రోగ్రాంలు ఉన్న సమయంలోనే పాఠశాలను వదిలి రావాల్సి ఉండగా ఎక్కువ సమయం విద్యాశాఖ కార్యాలయంలోనే కేటాయిస్తుండడంతో విద్యార్థులకు సరైన బోధన అందడం లేదని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘ నాయకులు మండిపడుతున్నారు.

డుమ్మా మాస్టర్‌లపై విచారణ

రెండు రోజుల కిందట 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన 'డుమ్మా మాస్టర్‌ల కథనంపై జిల్లా విద్యాశాఖధికారి విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులు నెలల తరబడి పాఠశాలలవైపు ముఖం చూడడం లేదని 'ఆంధ్రజ్యోతి' 'డుమ్మా మాస్టర్‌'లంటూ ప్రత్యేక కథనం ప్రచురించడంతో విద్యశాఖలో చర్చనీయాంశంగా మారింది. పాఠశాలకు సక్రమంగా విధులకు హాజరు కాని ఉపాధ్యాయులపై జిల్లా విద్యాశాఖధికారికి పలువురు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అదేవిధంగా సదరు డుమ్మా మాస్టర్‌లకు ఆయా మండల అధికారులు సహకరిస్తున్నారనే విమర్శలు రావడంతో విద్యాశాఖధికారి సదరు మండల అధికారులను పిలిపించుకుని వివరణ కోరినట్లు తెలిసింది. ఇదేక్రమంలో ఆయా మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో విధులకు హాజరు కాని ఉపాధ్యాయులకు నోటీసులు జారీ చేయాలని విద్యాశాఖధికారి మండల అధికారులకు ఆదేశించినట్లు సమాచారం.



అటకెక్కిన విచారణ

- జిల్లా వైద్యశాఖలో ఎన్ని ఆరోపణలు వచ్చినా బయటపడని వాస్తవాలు
- పోస్టులలో అవకతవకలు, వైద్య సిబ్బంది గైర్హాజరుపై విచారణే తప్ప చర్యలు కరువు
- పోస్టులు అమ్ముకున్నారనే ఆరోపణలపై విచారణకు ఆదేశం
- నెలలు గడుస్తున్నా నాన్చుడు ధోరణే
- విచారణలో నిజం బయటపెట్టకుండా సిబ్బందికి బెదిరింపులు
- ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి బదిలీకి యత్నం
- జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఓ మాజీ ఎమ్మెల్యే వద్ద మంతనాలు

కామారెడ్డి టౌన్, జనవరి 24: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని పలు విభాగాల్లో జరుగుతున్న అవకతవకలు, డబ్బులు తీసుకుని పోస్టులు భర్తీ చేశారనే ఆరోపణలు, ఆయా పీహెచ్‌సీలలో వైద్య సిబ్బంది గైర్హాజరుపై ఎప్పటికప్పుడు లుకలుకలు బయటపడుతున్నాయి. ఎన్ని ఆరోపణలు వచ్చినా, సాక్ష్యాధారాలతో సైతం ఫిర్యాదులు చేసినా అధికారులు అప్పటికప్పుడు విచారణ జరుపుతామని చెబుతూ నాన్చుడు ధోరణి, లేదంటే నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారే తప్ప ఎక్కడా వాస్తవాలను బయటపెట్టిన దాఖలాలు కనిపించడం లేదు. పైగా కొన్ని విచారణలో సాక్ష్యాధారాలను సమర్పిస్తే తీగతో డొంకను కదిలించే ప్రయత్నం చేయకుండా ఆరోపణలు వచ్చిన వారికే సాక్ష్యాధారాలకు సంబంధించిన విషయాల గుట్టు విప్పడంతో నిజాలు బయటపెట్టకుండా ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు ఆ శాఖలోని పలువురు సిబ్బందిని బెదిరింపులకు గురిచేసి వారికి అనుకూలంగా లేటర్‌లు రాయించి సంతకాలు చేయిస్తున్నారనే వాదనలు లేకపోలేదు. ఇదిలా ఉంటే విచారణ నత్తనడకన కొనసాగుతుండడం, అప్పట్లో ఫిర్యాదులు చేసిన వారే ఇప్పుడు అధికారంలోకి రావడంతో ఆ శాఖలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు తప్పించుకునేందుకు తమదైన శైలిలో ప్రయత్నాలు మొదలు పెట్టారని సమాచారం. ఏదైన శాఖలో ఆరోపణలు వినిపిస్తే వాటిని త్వరగా విచారణ జరిపి వారికి తగిన పరిష్కారం చూపాల్సి ఉన్నా అధికారులు అలసత్వం వహిస్తుండడంతో మిగిలిన విభాగాల సిబ్బంది సైతం ఎన్ని అవినీతి ఆరోపణలు వచ్చినా విచారణ పేరుతో కాలయాపన జరుగుతుందే తప్ప తమపై ఎవరు చర్యలు తీసుకుంటారులే అనే ధీమాతో మరిన్ని అవకతవకలకు పాల్పడుతున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

నెలలు గడుస్తున్నా నాన్చుడు ధోరణే

వైద్య ఆరోగ్యశాఖలో స్టాఫ్‌నర్సు, ఏఎన్‌ఎం పోస్టుల నియామకాల్లో భారీగా అవకతవకలు జరిగాయని ఒక్కో పోస్టుకు రూ.లక్షల్లో వసూలు చేశారనే ఆరోపణలు గత సంవత్సరం కింద పెద్ద ఎత్తున వచ్చాయి. ఆ సమయంలో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఈ అంశంపై పలు సమావేశాల్లో సైతం బహిరంగంగానే వైద్య ఆరోగ్యశాఖలోని పోస్టుల అమ్మకాల దందాపై విచారణ చేపట్టాలని పట్టుబట్టారు. కాంగ్రెస్ యువజన విభాగం నాయకులు ఒక అడుగు ముందుకు వేసి పోస్టుల అమ్మకాలకు సంబంధించి తమ వద్ద పలు ఆధారాలు ఉన్నాయని విచారణ జరిపితే వాటిని అందించేందుకు తాము సిద్ధమని ప్రకటించారు. ఆ తర్వాత ఉన్నతాధికారులు విచారణ జరిపి ఆరోపణలపై శాఖలోని సిబ్బందిపై విచారణ జరపడంతో పాటు కాంగ్రెస్ నాయకులు సమర్పించిన ఆధారాలను సైతం పరిశీలించారు. ఈ ఆధారాల్లో ఓ కిందిస్థాయి సిబ్బంది డబ్బులు తీసుకుంటుండడం స్పష్టంగా కనిపిస్తుండడంతో ఆ శాఖ పని తీరుపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినప్పటికీ చర్యలు మాత్రం తీసుకోలేదు. దీంతో ఆ ఆధారాల్లో ఉన్న పలువురు సిబ్బందిని విచారిస్తే తమకు అనుకూలంగా చెప్పాలని ఎక్కడ డబ్బులు తీసుకున్నట్లు వెల్లడించవద్దని బెదిరింపులకు గురి చేయడం కొసమెరుపు. దాదాపు 6 నుంచి 8 మంది సిబ్బంది వద్ద అనుకూలంగా సంతకాలు సైతం తీసుకున్నారని సమాచారం. నెలల తరబడి నాన్చుడు ధోరణితోనే ఈ తతంగం నడిపిస్తున్నారని పైగా లక్షలు వెనకేసుకున్న సూత్రధారులను తప్పించే ప్రయత్నం చేయడంతో పాటు పాత్రధారిని ఇరికించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే ఇటీవల ఓ పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్ విధులకు హాజరుకాకున్న సంతకాలు చేయడంతో విచారణకు ఆదేశించామని చెబుతున్నా అధికారులు ఈ విచారణలో సైతం నాన్చుడు ధోరణే ప్రదర్శిస్తున్నారని తెలుస్తోంది.

ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారి బదిలీకి యత్నం

ఉద్యోగాల భర్తీలో అవకతవకలకు పాల్పడిన అధికారులపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారని ఫిర్యాదుదారులు పట్టుబడుతుండడంతో ఎప్పటికైనా తన పోస్టుకు ఇక్కడ ఉంటే ముప్పేనని ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో ఒకరైన అధికారి బదిలీకి యత్నిస్తున్నట్లు సమాచారం. గత ప్రభుత్వంలో విచారణను సాగదీసేందుకు ప్రయత్నించినా కొద్దిమేర సక్సెస్ అవడం, ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు రావడం ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికలపై దృష్టి సారించడంతో ఇక ఏ దిగులు లేదని మళ్లీ అదే ప్రభుత్వం వస్తే ఆ పార్టీలోని పలువురు నాయకులతో విచారణను పూర్తిస్థాయిలో కనుమరుగు చేసేద్దామనే ఆలోచనలో ఉన్న అధికారికి ఆ పార్టీ అధికారంలోకి రాకపోవడంతో ఆందోళన మొదలైందని తెలుస్తోంది. దీంతో తనను ఎలాగైన ఈ జిల్లా నుంచి జీహెచ్‌ఎంసీ పరిధిలోని మార్చాలని విశ్వప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. ఈ తరుణంలోనే ప్రస్తుత ప్రభుత్వంలో ఉన్న ఓ మాజీ ఎమ్మెల్యే వద్దకు వెళ్లి బదిలీకి ప్రయత్నాలు మొదలుపెట్టాడని సమాచారం. బదిలీపై వెళ్లిపోతే తనపై విచారణ ఆగిపోతుందని మాస్టర్ ప్లాన్ వేసినట్లు తెలుస్తోంది.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బీబీ పాటిల్

తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం నెరవేర్చింది

జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్

సదాశివనగర్, జనవరి 24: తెలంగాణ ప్రజల అవసరాల మేరకు హామీలు ఇచ్చి నెరవేర్చిన ఘనత కేవలం బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌కు చెందుతుందని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ అన్నారు. బుధవారం సదాశివనగర్ మండలం మల్లన్నగుట్ట అశోక్‌గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం కోసం దొంగ హామీలను ప్రకటించి ప్రజలను నమ్మించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఎద్దేవా చేశారు. నెల రోజులు గడవకముందే తెలంగాణ ప్రజలు కేసీఆర్ యొక్క గొప్పతనాన్ని గుర్తించారని మంచి నాయకున్ని పోగొట్టుకున్నామనే బాధ ప్రజల్లో కలుగుతుందని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని 10 సంవత్సరాలు ప్రజలకు అనేక సేవలు అందించానని తిరిగి ఐదు సంవత్సరాలు ప్రజలకు సేవ చేసేందుకు మీతో కలిసి ఉంటానని కార్యకర్తలకు హామీ ఇచ్చారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సురేందర్ మాట్లాడుతూ సాధ్యం కాని హామీలను ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని 100 రోజులు కాకుంటే 150 రోజుల లోపల ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే ప్రజల పక్షాన పోరాటం చేస్తూ నియోజకవర్గ ప్రజలకు న్యాయం చేస్తానని అన్నారు. కాంగ్రెస్ ఏనాడు అధికారంలోకి వస్తానని కలలు కూడా కనకపోవచ్చు అని ఊహించని అధికారం రావడంతో ఏం చేయాలో తోచని పరిస్థితిలో పార్టీ ఉందని ఎద్దేవా చేశారు. ప్రతీ కార్యకర్త మనో ధైర్యం కోల్పోకుండా పార్ల మెంట్ ఎన్నికల్లో కష్టపడి పనిచేసి బీబీ పాటిల్‌ను 70వేల ఓట్లు నియోజకవర్గంలో నుంచి ఇస్తామని హామీ ఇచ్చారు. మనలో మనం ద్వేషాలు పెంచుకోకుండా సమిష్టిగా కలిసి పనిచేసి పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకువద్దామ న్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నర్సింలు, ఎంపీపీ గైని అనసూయ, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పిల్లలకు అల్బెండజోల్ మాత్రలను వేయాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డి టౌన్, జనవరి 24: పిల్లల్లో నులి పురుగులను నివారించేందుకు వచ్చే నెల 12, 14 తేదీల్లో జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాతీయ నులి పురుగుల దినోత్సవ కార్యక్రమంపై ఏర్పాటు చేసిన జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ నులి పురుగులు ఉన్నట్లయితే రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి లేకపోవడం, కడుపు నొప్పి వంటి వాటితో బాధపడుతారని తెలిపారు. జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాలలోపు 2,52,538 మంది పిల్లలున్నారని వారికి నులి పురుగుల దినోత్సవం సందర్భంగా అల్బెండజోల్ మాత్రలు వేయించనున్నామని తెలిపారు. రెండు సంవత్సరాలలోపు పిల్లలకు సగం మాత్ర, రెండు నుంచి మూడు సంవత్సరాలలోపు పిల్లలకు ఒక మాత్రను నలిపి ఇవ్వాలని తెలిపారు. 3 నుంచి 19 సంవత్సరాలలోపు పిల్లలకు చప్పరించేలా వేయించాలని అధికారులకు తెలిపారు. ఈ మందులు వేసుకోవడం వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ రావని, మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత పిల్లలు మాత్ర వేసుకునేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఆసుపత్రి కో ఆర్డినేటర్ శ్రీనివాస్, జిల్లా అధికారులు దయానంద్, షేక్‌సలాం, మురళీకృష్ణ, సునీత, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

బాలికలను రక్షిద్దాం.. చదివిద్దాం!

బాలికలను రక్షిద్దాం.. చదివిద్దామని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బుధవారం జాతీయ బాలిక దినోత్సవం పురస్కరించుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మొక్కను నాటారు. ఆడ పిల్లలకు రక్షణ కల్పిద్దామని, వారి బంగారు భవితకు పునాది వేద్దామని తెలిపారు. ఆడ పిల్లలను వారి తల్లిదండ్రులు ఇంటికి వెలుగుగా భావించాలని సూచించారు. ఆడపిల్లలను చదివించి ఉన్నత ఉద్యోగాలు పొందే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ బావయ్య, సీడీపీవో శ్రీలత, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాధవనగర్ రైల్వే గేటు మూసివేత

డిచ్‌పల్లి, జనవరి 24: నిజామాబాద్‌లోని మాధవనగర్ రైల్వేగేటు (ఆర్వోబీ) నిర్మాణ పనులు తుదిదశలో ఉన్నందున పనుల వేగవంతం కోసం గురువారం నుంచి వచ్చే నెల 20 వరకు రైల్వే గేటు పూర్తి స్థాయిలో మూసి వేయనున్నామని సౌత్ సెంట్రల్ రైల్వే హైదరాబాద్ డివిజన్ డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ శివరాము బుధవారం ఉత్వర్వులు జారీ చేశారు. ఈ మేరకు కలెక్టర్, నిజామాబాద్ సీపీ, మున్సిపల్ కమిషనర్, ఆర్డీవో, ఆర్ అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌లకు సమాచారం అందజేశారు. వంతెన నిర్మాణ పనులు తుదిదశకు చేరిన కారణంగా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు రాకుండా 193 లెవల్ రైల్వే క్రాసింగ్ గేటును మూసి వేయాలని నిర్ణయించినట్లు ప్రకటనలో తెలిపారు.

ఎన్టీఆర్‌కు భారత రత్న ఇవ్వాలి

● సీహెచ్‌వీ హనుమంతరావు

బోధన్‌రూరల్, జనవరి 24: ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు కలిగిన నేషనల్ ఫ్రంట్ మాజీ ఛైర్మన్, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత నేత నందమూరి తారక రామారావుకు అత్యుత్తమ పురస్కారం అయిన భారత రత్న ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ ప్రధానకార్యదర్శి సీహెచ్‌వీ హనుమంతరావు డిమాండ్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలు గు జాతి గుర్తింపు కోసం కృషి చేసిన మహానేతను విస్మరించడం బాధాకర మని అన్నారు. సామాజిక న్యాయాన్ని ఆచరణలో చూపించి అట్టడుగు వర్గాలకు పదవులు, పరపతి గౌరవం ఇచ్చిన ఎన్టీఆర్‌ను గుర్తించకపోవడం కేంద్ర ప్రభుత్వం వివక్షతకు నిదర్శనమని పేర్కొన్నారు.




పశువులకు టీకాలు వేస్తున్న జిల్లా పశు వైద్యాధికారి జగన్నాథచారి

కిసాన్ క్రెడిట్ కార్డు ఉన్న రైతులు పశువుల రుణాలకు అర్హులు: జిల్లా పశు వైద్యాధికారి

నందిపేట, జనవరి 24: కిసాన్ క్రెడిట్ కార్డు ఉన్న ప్రతీ రైతు పశువుల రుణాలు పొందడానికి అర్హులని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ జగన్నాథచారి తెలిపారు. బుధవారం నందిపేట మండలం చింరాజ్‌పల్లి గ్రామంలో మండల పశు వైద్యశాల ఆద్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ జగన్నాథచారి మాట్లాడుతూ కైసైసీ ఉన్న రైతుకు రూ.1.60వేల పశువుల రుణం ఇ సామని, ఒక్కో గేదెకు రూ.24వేలు చొప్పున మెంటెనెన్స్ కింద రుణం లభిస్తోందని వివరించారు. బ్యాంకులో పంటల రుణం రూ.లక్షా ఉంటే రూ.60వేలు రుణం వస్తుందన్నారు. అర్హులైన రైతులు ఆధార్ కార్డు, పాన్ కార్డు, రేషన్, పాన్‌కార్డు, ఆదాయం సర్టిఫికెట్, బ్యాంకు పాస్ బుక్కు జిరాక్స్‌లు, రెండు ఫోటోలతో ఆయా మండల పశు వైద్యశాలలో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ జగన్నాథచారి కోరారు. జిల్లాలో 3లక్షల 8వేల 150 పశువులు ఉన్నాయని, అందులో లక్షా 2వేల 252 ఆవులు, 2లక్షల 6వేల 898 గేదెలు ఉన్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సహాయ సంచాలకులు డాక్టర్ మాజీద్, మండల పశు వైద్యాధికారి డాక్టర్ హన్మంత్‌రెడ్డి, సర్పంచ్ తోట గణేష్, ఎంపీటీసీ సభ్యులు సిరిగిరి శ్రీనివాస్, పాల కేంద్రం అధ్యక్షుడు గాంధీ, పశువైద్య సిబ్బంది సరళారాణి, విజయ, స్వప్న, సత్యం, శ్యామల, విజయ లక్ష్మి, రైతులు ఉన్నారు.





ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్	డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి	ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట	ఏషియన్ సత్యం - అమీర్‌పేట్
ఫోరం మాల్ - కూకట్‌పల్లి	సినీ ప్లానెట్ - కొంపల్లి
ఆర్.కె. - బంజారాహిల్స్	ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్
ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్	ఏషియన్ రాధిక - కాప్రా
గలేరియా - పంజాగుట్ట	ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఐకాన్ - హైటెక్‌సిటీ	ఎంజెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి
పివిఆర్ సినిమాస్ - ఎర్రమంజిల్	మిరాజ్ శాలిని శివాని - దిల్‌సుఖ్‌నగర్
పివిఆర్ సినిమాస్ - ముసారాంబాగ్	మిరాజ్ సినిమాస్ - బాలానగర్
ప్రిస్టన్‌మాల్ - గచ్చిబౌలి	మిరాజ్ సినిమాస్ - చందానగర్
అట్రియమ్ - గచ్చిబౌలి	లక్ష్మీనరసింహ - మియాపూర్
ఎస్2 సోమ - మల్లాపూర్	రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్	జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి
ఎం.పి మాల్ - కాచిగూడ	మూవీటైమ్ - అమీర్‌పేట
జిఎస్ఎమ్ - మదీనగూడ	ఎస్.ఎల్.ఎన్ - గచ్చిబౌలి
నెక్లెస్ సత్వ - కవాడిగూడ	టివోలి - సికింద్రాబాద్
అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్	విజయలక్ష్మి - ఎల్.బి.నగర్
మంజీరామాల్ - కూకట్‌పల్లి	శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
సి.సి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి	షా షహెన్‌షా - చింతల్
మంత్రామాల్- అత్తాపూర్	లక్ష్మీకళ సినీప్రైడ్ - మూసాపేట్
సుధా - శాలిబండ	మూవీమ్యాక్స్ - మౌలాలి
	జె.పి.సినిమాస్ - చందానగర్

'రెవెన్యూ' వద్ద ఆ భూమి రికార్డుల్లేవ్!

- హైదరాబాద్-శ్రీశైలం హైవే భూమి వివరాలివ్వాలని ఎన్‌హెచ్‌ఏఐకు వినతి
- 'రహదారికీ రైతుబంధు'పై విస్తృత చర్చ
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై అధికారుల ఆరా

ఆమనగల్లు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 'రహదారికీ రైతుబంధు' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం సర్వత్రా చర్చనీయాంశమైంది. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి నిర్మించిన భూమికి ప్రభుత్వం ఏళ్లుగా రైతుబంధు సొమ్ము ఇస్తూ వచ్చిన వైనాన్ని 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టింది. అయితే రోడ్డు నిర్మించిన భూమికి సంబంధించి రెవెన్యూ అధికారుల వద్ద సరైన రికార్డులు లేనట్లు సమాచారం. దాంతో ఆ రికార్డులు అందజేయాలని రెవెన్యూ అధికారులు.. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులను కోరినట్లు తెలిసింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లో ఈ సమస్య వెలుగుచూసింది. రోడ్డు కోసం పట్టా భూములను సేకరించినా దానికి అనుగుణంగా రికార్డుల్లో మార్పు చేయలేదు. గత ప్రభుత్వ లోపాల వల్ల ఈ భూమికి రైతుబంధు సహాయం అందుతుండడమే కాక మరో సమస్య కూడా తలెత్తుతోంది. భూముల ధరలకు రెక్కలు వస్తుండడంతో చాలామంది రైతులు జాతీయ రహదారి ఉన్న భూమిని కూడా ధరణి రికార్డుల ఆధారంగా విక్రయించి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఇదే జరిగితే పెద్దఎత్తున వివాదాలు చోటు చేసుకునే అవకాశాలు లేకపోలేదు. ఇటీవల కడ్తాల- మైసిగండి మధ్య రోడ్డు నిర్మాణం జరిగిన 1.20 ఎకరాల భూమి.. ధరణి పాస్ పుస్తకంలో కూడా ఉండడంతో రూ.5 కోట్లకు విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దాన్ని వేరొకరికి రిజిస్ట్రేషన్ చేయకుండా బ్లాక్‌లిస్టులో పెట్టాలని రాష్ట్ర ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు అందింది.


హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి

కాగా, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను రికార్డులు అడగడంతో పాటు రోడ్డు ఉన్న సర్వే నంబరు భూములను పరిశీలించి సంబంధిత రైతుల రికార్డుల నుంచి ఆ భూమిని తొలగించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఇటు ప్రభుత్వం ఈ విషయమై ఉన్నతస్థాయి విచారణ జరిపిస్తే అనేక విషయాలు వెలుగుచూసే అవకాశం ఉందన్న అభిప్రాయం స్థానిక ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ఆమనగల్లుకు చెందిన ఓ రైతు ఇటీవల స్థానిక తహసీల్దార్‌కు, కడ్తాల్‌కు చెందిన మరో రైతు ప్రజావాణిలో సీఎం రేవంత్ రెడ్డికి ఇదే విషయమై ఫిర్యాదు చేశారు.

కేసీఆర్‌ను సీఎం చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బాధాకరమేమీ కాదని, చాలా చిన్న దెబ్బ మాత్రమే తగిలిందని అన్నారు. "ప్రజలు మనల్ని ఛీకొట్టలేదు. 39 స్థానాల్లో గెలిచాం. మరో 14 స్వల్ప తేడాతో ఓడాం. ఆ 14 స్థానాల్లో ఇతర పార్టీలు గతంలో రెండు, మూడు, నాలుగుసార్లు వరుసగా పోటీచేసి.. ఒక్కసారైనా గెలిపించాలంటూ ఏడవడంతో ప్రజలు భావోద్వేగాలతో వారికి ఓటేశారు. ఇందులో ఆరేడు స్థానాలు బీఆర్ఎస్ గెలిస్తే ఎలా ఉండేది? 1.85 శాతం ఓట్ల తేడాతో మాత్రమే అధికారం కోల్పోయాం" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజల తీర్పు ను అవమానపరిచే విధంగా మాట్లాడవద్దని పార్టీ శ్రేణులు, సోషల్ మీడియా వారియర్స్‌కు సూచించారు. "కరీంనగర్ లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో కరీంనగర్, సిరిసిల్ల, హుజూరాబాద్‌లో గెలిచాం. మిగిలిన నాలుగింటిలో కూడా వారు సానుభూతితోనే గెలుపొందారు. అయినా మనకంటే వారికి కేవలం ఐదారు వేల ఓట్లు మాత్రమే ఎక్కువ వచ్చాయి. ఈ ఏడుపు, సానుభూతి ఎప్పటికీ ఉండదు" అని వ్యాఖ్యానించారు.

420 హామీలతో ప్రజలను నమ్మించారు..

ఎన్నికల్లో తప్పుడు హామీలతో రేవంత్‌రెడ్డి ప్రజలను నమ్మించారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలే కాకుండా.. మేనిఫెస్టోలో పేర్కొన్నవన్నీ కలిపి 420 హామీలు ఇచ్చారని, వాటిని ప్రజలకు వివరించి అమలయ్యే వరకు పోరాడుదామని పిలుపునిచ్చారు. హామీలు అమలు చేయకుంటే రోడ్డుపై బట్టలూడదీసి ప్రభుత్వాన్ని నగ్నంగా నిలబెడతామని హెచ్చరించారు. సోషల్ మీడియాను పదునుగా వాడుకొని నరేంద్రమోదీ ప్రధానమంత్రి, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని చెప్పారు. రైతు భరోసా ఇచ్చామంటూ రేవంత్‌రెడ్డి దావో‌స్‌లో పచ్చి అబద్ధం చెప్పారని, రైతుబంధు పేరు మార్చారే తప్ప.. డబ్బులు ఇవ్వలేదని తెలిపారు. రైతుబంధు పడలేదంటే చెప్పుతో కొడతామంటూ మంత్రి కోమటిరెడ్డి చేసిన వాఖ్యలపై కేటీఆర్ మండిపడ్డారు. రైతు భరోసా రాని70 లక్షల మంది రైతులు ఈ ప్రభుత్వాన్ని చెప్పుతో కొడతారో, ఓట్లతో కొడతారో ఆలోచించుకోవాలన్నారు. క్వింటాల్ ధాన్యానికి ఇస్తామన్న రూ.500 బోనస్ ఇచ్చి తీరాలని డిమాండ్ చేశారు. మార్పు కావాలని ఓట్లు వేసిన 6.5 లక్షల ఆటో కార్మికుల కుటుంబాల కొంప కొల్లేరు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు వారికి ఏ అవకాశమచ్చినా కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎరువులు, విత్తనాల దుకాణాల వద్ద క్యూ కట్టాల్సి వస్తుందని ఎవరూ అనుకోలేదని, మళ్లీ ఆ రోజులు వచ్చాయని విమర్శించారు. బస్సుల సంఖ్యను పెంచకుండా, బస్సుల కండిషన్ ఎలా ఉందో తెలుసుకోకుండా అనాలోచితంగా మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయడంతో బస్సుల్లో వారు కొట్టుకుంటున్నారని తెలిపారు. మరోవైపు డబ్బులు పెట్టుకొని వెళ్లే పురుషులకు సీట్లు దొరకడం లేదని, ఎవరూ సంతృప్తిగా లేరని అన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలోని కోటి 57 లక్షల మంది మహిళలకు నెలకు 2,500 ఇవ్వకుంటే తాట తీయాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని అసెంబ్లీలో ప్రశ్నిస్తే.. తాము ఆ హామీ ఇవ్వలేదని భట్టివిక్రమార్క అన్నారని చెప్పారు.


బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ భేటీలో మాట్లాడుతున్న కేటీఆర్

మతం, దేవుళ్లతో బీజేపీ రాజకీయం..

బీజేపీ ఎంపీలు మతం, దేవుళ్లతో దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. నిత్యం మతం, ధర్మం అంటూ రెచ్చగొడుతూ కరీంనగర్‌లో గెలిచిన బండి సంజయ్‌కుమార్ అట్టర్ ఫ్లాప్ ఎంపీ అని విమర్శించారు. వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట రామాలయానికి మోదీ నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదన్నారు. ఐదేళ్లలో సంజయ్ చేసిన అభివృద్ధి ఏంటో మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నలుగురు ఎంపీలను ఓడించింది బీఆర్ఎస్ కాదా? రెండు పార్టీలు ఒకటైతే కామారెడ్డిలో కేసీఆర్ ఓడిపోయేవారా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మోదీ, అదానీ ఒకటేనంటూ రేవంత్, రాహుల్ గాంధీ ప్రచారం చేశారని, ఇప్పుడు ఆయనతోనే ఒప్పందం కుదుర్చుకున్నారని విమర్శించారు. బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్‌లో మోదీ, అదానీ తరువాత.. రేవంత్ మూడో ఇంజన్‌గా మారారన్నారు. కేసీఆర్ సర్కారు పదేళ్లు అదానీని రాష్ట్రంలో అడుగుపెట్టనీయలేదని, అమిత్‌షా, మోదీ సూచనతోనే అదానీతో రేవంత్ ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని విద్యుత్ ప్రాజెక్టులు, ఇతర సంస్థలను అదానీకి కట్టబెడతారన్నారు. రేవంత్ మరో ఏక్‌నాథ్ షిండే అయినా ఆశ్చర్య పోవలసిన అవసరం లేదని, మైనారిటీలు ఆలోచించాలని సూచించారు.


మీడియాతో ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, మహిపాల్‌రెడ్డి

విపక్ష ఎమ్మెల్యేలు సీఎంను కలవకూడదా?

- రేవంత్ తెలంగాణ రాష్ట్రానికి సీఎం కాదా?
- సమస్యల పరిష్కారం కోసమే కలిశాం
- పార్టీని వీడేది లేదు.. ప్రతిపక్షంలోనే ఉంటాం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీత, ప్రభాకర్‌రెడ్డి మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు స్పష్టీకరణ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):"కాంగ్రెస్ పార్టీకే.. రేవంత్ ముఖ్యమంత్రా? తెలంగాణకు కాదా? నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్ష నేతలు సీఎంను కలవకూడదా?" అని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, కె.మాణిక్‌రావు ప్రశ్నించారు. తాము కాంగ్రెస్‌లో చేరుతున్నామంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. రెండ్రోజుల క్రితం ఈ నలుగురు ఎమ్మెల్యేలూ సీఎం రేవంత్‌ను కలవడంతో వారు పార్టీ మారుతున్నారన్న ప్రచారం జోరందుకుంది. ఈ నేపథ్యంలో వారు బుధవారం మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగానే కలిశామని, ప్రజాసమస్యలను చర్చించడంతోపాటు సెక్యూరిటీ, ప్రొటోకాల్ సమస్యలపై కూడా మాట్లాడామన్నారు. ప్రతిపక్షంలో ఉంటే సీఎంను, మంత్రులను కలవకూడదా? ప్రధాని మోదీని, కేంద్రమంత్రులను సీఎం రేవంత్ కలవడం లేదా అని ప్రశ్నించారు. తమ నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం, అభివృద్ధి అంశాల్లో సహకరించాలని సీఎంను కోరామన్నారు. కాంగ్రెస్ లోకి వెళ్లాల్సిన అవసరం తమకు ఏముందని వారు ప్రశ్నించారు. సీఎంను మాత్రమే కాదని, సమస్యల పరిష్కారం కోసం మంత్రులనూ కలుస్తూనే ఉంటామన్నారు. తమపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఆపాలని, లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీ మారే ప్రసక్తే లేదని.. ప్రతిపక్షంలోనే ఉండి పోరాడతామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్సే మెజార్టీ స్థానాల్లో గెలుస్తుందని అన్నారు.

రాహుల్ ప్రజల్లోకి వెళ్తుంటే బీజేపీకి ఎందుకంత భయం?

- గుడికి వెళ్లడానికీ అసోం సీఎం అనుమతి కావాలా?
- అప్పట్లో బతుకమ్మ పేరుతో కవిత మాదిరిగానే ఇప్పుడు రామాలయం పేరుతో మోదీ సినిమా చూపిస్తున్నారు..
- అయోధ్య గుడికి కారకుడైన అడ్వాణీని సన్మానించారా?: జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): "రాహుల్‌గాంధీ ప్రజల్లోకి వెళతుంటే.. బీజేపీకి ఎందుకంత భయం? రాహుల్ గాంధీ గుడికి పోవద్దా? అందుకు అసోం సీఎం అనుమతి తీసుకోవాలా?" అంటూ టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి ప్రశ్నించారు. అసోం ప్రజలకు ఇబ్బంది లేకుండా రాహుల్‌గాంధీ పాదయాత్ర సాగుతోందని, అయితే ప్రధాని మోదీ దగ్గర మెప్పు కోసమే పాదయాత్రను అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ అడ్డుకున్నారని ఆరోపించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన గాంధీ కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీని యాత్ర చేయకుండా అడ్డుకునే కుట్రను బీజేపీ చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడారు. మోదీ పాలనలో న్యాయమైన పాలన జరగట్లేదని, ధరల పెరుగుదలకూ అడ్డూ అదుపూ లేకుండా పోతోందని విమర్శించారు. దీనిపై ప్రజలను సంఘటితం చేసే పనిలో భాగంగా రాహుల్‌గాంధీ 'న్యాయ్ యాత్ర'ను చేపట్టారని, అసోంలో రాహుల్ యాత్రను బీజేపీ వాళ్లు అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం? అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగానే అసోం ప్రభుత్వం అక్కడ శాంతి భద్రతల సమస్యను సృష్టిస్తోందని ఆరోపించారు. నిన్న మొన్నటిదాకా బతుమ్మ పండుగే లేనట్లుగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బతుకమ్మ పేరుతో సినిమా చూపించిందని, ఇప్పుడు ప్రధాని మోదీ.. రామాలయం పేరుతో సినిమా చూపిస్తున్నారని విమర్శించారు. బీజేపీ నేతలు ఈ మధ్యనే కళ్లు తెరిచి.. రాములవారిని మొక్కాలని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. "రాములవారు పుట్టిన తర్వాత బీజేపీ పుట్టిందా? బీజేపీ పుట్టిన తర్వాత దేవుడు పుట్టాడా? ఆ పార్టీ పుట్టి కేవలం 40 ఏళ్లు అవుతుంది. సీతమ్మ, రాముల వారు పుట్టి నాలుగు యుగాలవుతోంది. ప్రధాని మోదీ, ఇక్కడి బీజేపీ నేతలు సీతారాముల కల్యాణం చేస్తారో లేదో తెలియదు నేను. మాత్రం ప్రతియేటా చేస్తాను" అని వ్యాఖ్యానించారు. అయోధ్య గుడికి అసలు కారకుడు బీజేపీ సీనియర్ నేత అడ్వాణీ అని, ఆయన దేశమంతా తిరిగి అయోధ్యలో రామాలయం కట్టాలని ప్రచారం చేశారని చెప్పారు. అలాంటి అడ్వాణీని కనీసం సన్మానించారా? అంటూ బీజేపీ నేతలను నిలదీశారు. సొంత పార్టీ నేత అడ్వానీ త్యాగమే గుర్తించని బీజేపీ.. కాంగ్రెస్ పార్టీ నేతల త్యాగం గుర్తిస్తుందా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌ను ఎందుకు కలిశారో తనకు తెలియదు కానీ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎంను ఎమ్మెల్యేలు కలవాలంటే కుదిరేది కాదన్నారు. గత తొమ్మిదేళ్లలో దక్కని అవకాశాన్ని సీఎం రేవంత్ 2 నెలల్లోనే కల్పించారన్నారు. గత తొమ్మిదేళ్లుగా చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకే సీఎం రేవంత్‌పై బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

ఈసీ ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు

- అమోయ్‌కుమార్, సుశీల్‌కుమార్, శ్రీధర్‌లకు బాధ్యతలు..

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం తిరిగి పోస్టింగులు ఇచ్చింది. ఈమేరకు సీఎస్ శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే.. వేటు పడిన అధికారులకు అప్రాధాన్య పోస్టింగులు ఇవ్వడం గమనార్హం. అలాగే సుదీర్ఘకాలం పాటు సింగరేణి సంస్థ సీఎండీగా పని చేసి, ఇటీవల బదిలీ అయి వెయిటింగ్‌లో ఉన్న ఎన్.శ్రీధర్‌కు కూడా ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ఆయన్ను షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించింది. ఇప్పటివరకు ఈ బాధ్యతలు చూస్తున్న సాగునీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాను బాధ్యతల నుంచి రిలీవ్ చేసింది. ఈసీ ఆదేశాలతో పోస్టింగ్‌లు కోల్పోయి, వెయిటింగ్‌లో ఉన్న డి.అమోయ్‌కుమార్‌ను పశు సంవర్ధక శాఖ జాయింట్ సెక్రటరీగా, టి.వినయ్‌కృష్ణారెడ్డిని వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీగా, ఎస్.హరీశ్‌ను రవాణా, రోడ్లు-భవనాల శాఖ జాయింట్ సెక్రటరీగా ప్రభుత్వం నియమించింది. గనుల శాఖ డైరెక్టర్‌గా ఉన్న పి.కాత్యాయనిదేవిని బదిలీ చేసి తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(టీఎస్ఐఆర్‌డీ) సీఈఓగా నియమించింది. ఈ పోస్టు అదనపు బాధ్యతలు చూస్తున్న పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాను రిలీవ్ చేసింది. అలాగే వెయిటింగ్‌లో ఉన్న నాన్-కేడర్ అధికారి సుశీల్‌కుమార్‌ను గనుల శాఖ డైరెక్టర్‌గా నియమించింది.

మే నెలలో ఎంసెట్.. నేడు షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే మే నెలలో ఎంసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ గురువారం విడుదలకానుంది. ఎంసెట్‌తోపాటు రాష్ట్రంలో నిర్వహించే ఇతర ప్రవేశ పరీక్షల షెడ్యూళ్లను కూడా ఇదే రోజున అధికారులు విడుదల చేయనున్నారు. ఈ ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఆమోదం తెలిపారు. ఎంసెట్‌తోపాటు లాసెట్, ఐసెట్, ఈసెట్ వంటి ప్రవేశ పరీక్షలను నిర్వహించాల్సి ఉంది. ఈ సెట్ల షెడ్యూల్‌ను ముందుగానే విడుదల చేస్తే అందుకనుగుణంగా విద్యార్థులు సన్నద్ధం కావడానికి అవకాశముంటుంది. అధికారులు కూడా ప్రవేశ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు చేసుకునే వీలుంటుంది. ఈ నేపథ్యంలో ఆయా సెట్లను నిర్వహించే కమిటీలు, కన్వీనర్లను కూడా ప్రకటించనున్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామక ఫైల్‌ను

సత్వరం ఆమోదించండి

తమిళిసైతో సీఎం, డిప్యూటీ సీఎం భేటీ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్‌తో భేటీ అయ్యారు. ప్రభుత్వం తరఫున నిర్వహించే గణతంత్ర దినోత్సవాలకు హాజరు కావాల్సిందిగా ఆమెను ఆహ్వానించారు. గవర్నర్‌తో 20 నిమిషాలపాటు ప్రత్యేకంగా సాగిన సమావేశంలో.. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామకం, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పేర్లపై చర్చించినట్టు సమాచారం. టీఎస్‌పీఎస్సీకి చైర్మన్‌ను నియమించి ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్న ప్రభుత్వం.. రెండు రోజుల క్రితమే దానికి సంబంధించిన ఫైల్‌ను పంపింది. దానికి సత్వరం ఆమోదం తెలపాలని సీఎం, డిప్యూటీ సీఎం ఈ భేటీలో గవర్నర్‌కు విజ్ఞప్తి చేసినట్టు తెలిసింది. ఆ ప్రక్రియ ముగిసిన వెంటనే సభ్యులకు సంబంధించిన జాబితాను కూడా పంపిస్తామని చెప్పినట్టు సమాచారం. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నందున ఈ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు వారు గవర్నర్‌కు వివరించారు. తమిళిసై కూడా దీనికి సంబంధించి మరిన్ని వివరాలు అడిగి తెలుసుకున్నట్టు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. ఇక గవర్నర్ కోటా ఎమ్మెల్సీల విషయానికి వస్తే.. గత ప్రభుత్వం దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను ప్రతిపాదించగా, వారిని నామినేట్ చేయడానికి తమిళిసై నిరాకరించిన సంగతి తెలిసిందే. గవర్నర్ కోటాలో నియమితులయ్యేవారు సాహిత్యం, శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం, సమాజ సేవ వంటి రంగాల్లో నిష్ణాతులై ఉండాలి. ఈ అర్హతలు లేవంటూ దాసోజు, కుర్ర పేర్లను గవర్నర్ తిరస్కరించారు. ఈ నేపథ్యంలో.. రేవంత్ సర్కారు ఆ కోటా కింద ఇద్దరి పేర్లను ప్రతిపాదిస్తూ ఫైల్‌ను గవర్నర్‌కు పంపాలని భావించింది. అయితే ఈలోగా దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ కోర్టుకు వెళ్లారు. తమ పేర్లను తిరస్కరించడం చట్టవిరుద్ధమని.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా తమను నామినేట్ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని వారు కోర్టును కోరారు. దీంతో.. ఈ విషయం కోర్టులో ఉన్నందున తాను నిర్ణయం తీసుకోలేనని రేవంత్ సర్కారుకు గవర్నర్ స్పష్టం చేశారు. తాజాగా బుధవారం ఈ కేసును అడ్మిట్ చేసుకున్న న్యాయస్థానం.. ఎమ్మెల్సీలుగా కొత్త ప్రభుత్వం ప్రతిపాదించినవారిని గవర్నర్ నామినేట్ చేయకుండా స్టే ఇవ్వడానికి నిరాకరించింది. కాబట్టి ఈ ప్రక్రియపై ముందుకు వెళ్లొచ్చనే అభిప్రాయంలో ఉన్న ప్రభుత్వం.. ఆ విషయాన్ని గవర్నర్‌కు తెలిపింది. తాము ఈ కోటాకు అర్హులైన వ్యక్తులనే సిఫారసు చేస్తామని రేవంత్, భట్టి బుధవారం భేటీలో తమిళిసైకి వివరించగా.. దీనిపై న్యాయసలహా తీసుకుంటానని ఆమె చెప్పినట్టు తెలిసింది. ఫిబ్రవరి 2వ వారంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలు నిర్వహించే ఉద్దేశంతో ఉన్న నేపథ్యంలో రేవంత్, భట్టి ఆ విషయాన్ని కూడా గవర్నర్ వద్ద ప్రస్తావించినట్టు సమాచారం. కాగా.. గత కేసీఆర్ సర్కారు తీరుకు భిన్నంగా గణతంత్ర దినోత్సవాలకు గవర్నర్‌ను నేరుగా కలిసి ఆహ్వానించిన సీఎం, డిప్యూటీ సీఎం.. గవర్నర్ ప్రసంగానికి సంబంధించిన విషయాలను కూడా వివరించారు.


రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్

కామారెడ్డి టౌన్, జనవరి 24: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని బీఆర్ఎస్‌కు చెందిన పలువురు కౌన్సిలర్‌లు ఒక్కొక్కరిగా కాంగ్రెస్‌లోకి క్యూ కడుతున్నారు. పక్షం రోజుల్లోనే బీఆర్ఎస్‌కు చెందిన ముగ్గురు కౌన్సిలర్‌లు కాంగ్రెస్‌లో చేరడం విశేషం. తాజాగా బుధవారం 23వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ తేజావు మానస ప్రసాద్ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ శాఖల ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. షబ్బీర్‌అలీ కౌన్సిలర్‌ను కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ స్కీంలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌కు చెందిన పలువురు కౌన్సిలర్‌లు, నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరుతుండడం అభినందనీయమని అన్నారు. కాంగ్రెస్‌ను నమ్ముకుని పార్టీలోకి వస్తున్న వారికి సముచిత స్థానం కల్పిస్తామని షబ్బీర్‌అలీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, నాయకులు గోనె శ్రీనివాస్, పంపరి లక్ష్మణ్, రవీందర్‌గౌడ్, సుతారి రవి, ఉరుదోండ ప్రవీణ్, రవీందర్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.



షబ్బీర్‌అలీకి పుష్ప గుచ్ఛం అందజేస్తున్న బీర్కూర్ నాయకులు

షబ్బీర్ అలీని కలిసిన బీర్కూర్ కాంగ్రెస్ నాయకులు

బీర్కూర్: మాజీ మంత్రి షబ్బీర్ అలీ సీనియారిటీకి గుర్తింపు నిస్తూ ఆయనకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ శాఖల సలహాదారుగా ప్రభుత్వం నియమించింది. అలాగే మహేష్ కుమార్ గౌడ్ ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో బీర్కూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం బాన్సువాడ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డితో కలిసి బీర్కూర్ మండల కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. షబ్బీర్ అలీ, మహేష్‌కుమార్ గౌడ్‌లను కలిశారు. ఇరువురు నాయకులకు పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాయకులు నియోజకవర్గ, బీర్కూర్ మండల సమస్యలను షబ్బీర్ అలీ, మహేష్ కుమార్ గౌడ్‌ల దృష్టికి తీసుకు వెళ్లి వారితో చర్చించారు. ఇందులో బీర్కూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు బస్వరాజు, చందు, కమలాకర్ రెడ్డి, సాహెబ్ రావు, కృష్ణారెడ్డి, ఇక్బాల్ తదితరులు ఉన్నారు.



షబ్బీర్‌అలీ సమక్షంలో పార్టీలో చేరుతున్న కౌన్సిలర్ మానస ప్రసాద్

భిక్కనూరు: షబ్బీర్‌అలీని బుధవారం భిక్కనూరు మండలంలోని ఇసన్నపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా శాలువతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం జిల్లా నాయకులు తిర్మల్‌స్వామి మాట్లాడుతూ షబ్బీర్‌అలీ మున్ముందు మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదాగౌడ్, బాబు, నారాయణ, రాములు, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, అంజయ్య, లింగం, సత్తయ్య, సందాన్, తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: షబ్బీర్‌అలీని బుధవారం మండలంలోని ముత్యంపేట గ్రామ కల్లుడిపో గౌడ సంఘం సభ్యులు హైదరాబాద్‌లోని తన నివాసంలో కలసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో కే. బాల్‌రాజగౌడ్, ఎం.పీ. సిద్దాగౌడ్, కే.పీ సిద్దాగౌడ్, ఎం.సీ.సిద్దాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి



బాన్సువాడ డిపోలో డ్రైవర్లను సన్మానిస్తున్న ఆర్ఎం జానీరెడ్డి

● ఆర్ఎం జానీ రెడ్డి

బాన్సువాడటౌన్, జనవరి 24: విధి నిర్వాహణలో డ్రైవర్లు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ జానీరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్టీసీ డిపోలో డ్రైవర్స్ డే సందర్భంగా డ్రైవర్లను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణీకులను బస్సుల్లో వారివారి సురక్షిత ప్రాంతాలకు చేరవేయడంలో డ్రైవర్లు కీలక పాత్ర పోషిస్తారన్నారు. డ్రైవర్లు బస్సులు నడిపేటపుడు జాగ్రత్తలు పాటించాలని, ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. అంతేకాకుండా ఆర్టీసీ మాతృసంస్థగా భావించాలని, సంస్థ అభివృద్ధికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం ఆయన డిపోలో ఆటోమేటిక్ వాషింగ్ ప్లాంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ సరితాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.



సప్తాహలో పాల్గొన్న భక్తులు

సోనాలలో ముగిసిన సప్తాహ

మద్నూర్, జనవరి 24: మండలంలోని సోనాల గ్రామంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న శివ నామ సప్తాహ బుధవారం ముగిసింది. సప్తాహలో ఆయా మండలాలతో పాటు స్థానిక భక్తులు పాల్గొన్నారు. భజన కార్యక్రమాలతో పాటు మహారాజ్‌ల సందేశాలు భక్తులకు వినిపించారు. జీవితంలో ధర్మ రక్షణ పట్ల ప్రతి ఒక్కరూ ఉండాలని, ధర్మాన్ని రక్షిస్తేదేశం రక్షించబడుతుందని మల్లికార్జున స్వామి సూచించారు.

అలరించిన హరికథ పారాయణం

పెద్ద కొడప్‌గల్, జనవరి 27: మండల కేంద్రంలో మంగళవారం రాత్రి హైదరాబాద్‌కు చెందిన నారాయణదాసు బృందం ఆలపించిన హరికథ పారాయణం గ్రామస్థుల్ని అలరించింది. మండల కేంద్రంలో పీఎంపీ, ఆర్ఎంపీ, మెడికల్ అసోసియేషన్, ల్యాబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ హరికథ పారాయణం నిర్వహించగా, నారాయణదాసు బృందం శ్రీరామాయణ హరికథను వివరించారు. ఈ కార్యక్రమానికి గ్రామస్థులు భారీ సంఖ్యలో హాజరై హరికథను ఆలకించారు. అనంతరం హరికథ బృంద సభ్యులను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన డీసీసీ అధ్యక్షుడు



సీఎం రేవంత్‌రెడ్డితో ఉమ్మడి జిల్లా నాయకులు

కామారెడ్డిటౌన్, జనవరి 24: విదేశీపర్యటన ముగించుకుని వచ్చిన రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన డీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ శాఖల సలహదారుడు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్‌లతో కలిసి డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, మానాల మోహన్‌రెడ్డిలు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సన్మానించారు.

అగ్నిమాపక శాఖపై విద్యార్థులకు అవగాహన

రాజంపేట, జనవరి 24: మండలంలోని ఆరేపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం కామారెడ్డి ఫైర్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో ఆధ్వర్యంలో విద్యార్థులకు అగ్నిమాపక దళం గురించి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. పాఠశాల విద్యార్థులకు అగ్నిమాపక దళం గురించి వివరిస్తు ప్రమాదాలు జరిగినప్పుడు ఏవిధంగా స్పందించాలనేది విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం గంగామోహన్, ఎస్ఎంసీ ఛైర్మన్ శ్యాంరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఫిజియోథెరఫీ

బీర్కూర్, జనవరి 24: మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో బుధవారం ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులకు వైద్యులు ఫిజియోథెరపీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో కొంత మంది శారీరక, మానసిన ఒత్తిడితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ మేరకు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. ప్రత్యేక అవసరమైన విద్యార్థులకు ఫిజియోథెరపీ చేసినట్లు తెలిపారు.



విద్యార్థులకు ఫిజియో థెరపీ చేస్తున్న దృశ్యం



కార్యాలయంలో 'స్వచ్ఛ భారత్' నిర్వహిస్తున్న నాయకులు

బీజేపీ ఆధ్వర్యంలో 'స్వచ్ఛ భారత్'

మద్నూర్, జనవరి 24: గత యేడాది మద్నూర్ మండలం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఆర్ డబ్ల్యూఎస్ కార్యాలయం బిచ్కుందకు తరలించడంతో నిరసన వ్యక్తం చేస్తూ బీజేపీ నాయకులు స్వచ్ఛ భారత్ నిర్వహించారు. మండల కేంద్రం నుంచి రోజుకో కార్యాలయం చొప్పున అప్పటి నాయకులు తరలించారన్నారు. ఈ నెల 26 వరకు తిరిగికార్యాలయాన్ని మద్నూర్‌కు తీసుకుని రావాలని, లేనట్లయితే ఆర్ డబ్ల్యూఎస్ కార్యాలయంలో గణతంత్ర్య దినోత్సవ జెండా గుర వేస్తామన్నారు. కార్యక్రమంలో బీజెవైఎం రాష్ట్ర సభ్యులు కృష్ణ పటేల్, జిల్లా జనరల్ సెక్రెటరీ తుకారాం, ఓబీసీ మోర్చా కన్వీనర్ సంతోష్, బీజెవైఎం మండలాధ్యక్షుడు తుకారాం తదితరులున్నారు.

బాన్సువాడలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర



కేంద్ర పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న అధికారులు

బాన్సువాడటౌన్, జనవరి 24: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా సమీపంలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉండగా కొన్ని శాఖల అధికారులు మాత్రమే హాజరుకావడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి అధికారులు ప్రజలకు వివరించారు. ఏ పథకం ఏవిధంగా ప్రజలకు ఉపయోగపడుతుందో చెప్పాలని బీజేపీ నాయకులు అధికారులను ప్రశ్నించారు. ముఖ్యంగా డ్వాక్రా రుణాలపై పూర్తి వివరాలను తెలియజేయాలని బ్యాంకు అధికారులను కోరగా, బ్యాంకుకు వస్తే సామాధానం చెబుతామని దాట వేశారు. మహిళలకు ఇప్పటి వరకు పొదుపు డబ్బులు అందజేయడం లేదని అధికారుల దృష్టికి తీసుకరాగా, పై అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కారమయ్యేలా చూస్తామని అధికారులు ప్రజలకు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను పూర్తి తరహాలో అవగాహన కల్పించి ప్రజలకు లబ్ధి చేకూర్చాలని నాయకులు, ప్రజలు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ అధికారి భార్గవ్, మున్సిపల్ కమిషనర్ రమేశ్, ఏవో ప్రియాంక, యూనియన్ బ్యాంక్ మేనేజర్ చంద్రకాంత్, బీజేపీ నాయకులు సాయికిరణ్, హన్మాండ్లు, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, కోనాల గంగారెడ్డి, శంకర్‌గౌడ్, డాకయ్య తదితరులున్నారు.



బీర్కూర్ పాఠశాలలో విద్యార్థులను చేర్పిస్తున్న దృశ్యం

బడి బయట విద్యార్థులను బడిలో చేర్చిన అధికారులు

బీర్కూర్, జనవరి 24: మండల కేంద్రం పరిధిలో అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బడి బయట పిల్లలను ప్రత్యేక అవసరాలు ఉన్న ఇద్దరు పిల్లలను గుర్తించారు. అనంతరం బీర్కూర్ జడ్పీ హెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. బడిఈడు పిల్లలందరూ బడుల్లో ఉండాలని, ఎవరైనా పిల్లలు బడి బయట ఉంటే తమకు సమాచారం అందించాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు జ్ఞానేశ్వర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకన్న , ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

బాన్సువాడటౌన్, జనవరి 24: గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. కబడ్డీ, ఖోఖో, రన్నింగ్, వ్యాసరచన, డ్రాయింగ్ వంటి పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటూ తమ ప్రతిభను చాటుతున్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు 26న బహుమతులను అందజేస్తామని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

వికలాంగ విద్యార్థులకు వైద్య పరీక్షలు

పెద్ద కొడప్‌గల్, జనవరి 24: మండల కేంద్రంలోని భవిత సెంటర్‌లో బుధవారం వికలాంగవిద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యురాలు విశాలాక్షి మాట్లాడుతూ.. సాధారణ పరీక్షలలో భాగంగా నేడు విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. తాము భవిత సెంటర్‌లో ఏవిధంగా చిన్నారులకు ఫిజియోథెరపి చేస్తున్నామో ఇంటి దగ్గర విద్యార్థుల తల్లితండ్రులు అదే విధంగా విద్యార్థులచే ఫిజియోథెరపి చేయించినట్లయితే తొంద రగా వ్యాధి నయం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కమల, సిఆర్‌పి గోపాల్, ప్రత్యేక ఉపాధ్యాయుడు బల్‌రాం తదితరులు పాల్గొన్నారు.

అటవీ ప్రాంతంలో మృతదేహం లభ్యం

నసురుల్లాబాద్, జనవరి 24: నసురుల్లాబాద్ అటవీ ప్రాంతంలో బుధవారం మృతదేహం సమాచారం తెలుసుకున్న నసురుల్లాబాద్ ఎస్సై లావణ్య సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతి చెందిన వ్యక్తి పోతంగల్ మండలం కల్లూరు గ్రామానికి చెందిన అంజయ్యగా గుర్తించారు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు అంజయ్య అదృశ్యమైనట్లు మృతుడి కుటుంబ సభ్యులు కొన్ని రోజుల క్రితం కోటగిరి పోలీస్‌స్టేషన్‌లో అదృశ్యం అయినట్లు కేసు నమోదు చేశారని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో ఎల్లయ్య

విద్యార్థులకు చతుర్వేద ప్రక్రియలు నేర్పాలి

కామారెడ్డి టౌన్, జనవరి 24: కామారెడ్డి మండలంలోని ఆర్‌బీ నగర్, నర్సన్నపల్లి పాఠశాలలను బుధవారం ఎంఈవో ఎల్లయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ చదవడం, రాయడం చతుర్వేద ప్రక్రియలు రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులందరూ ప్రతిరోజూ బడికి రావాలని సూచించామన్నారు. ఈ సమావేశంలో సీఆర్‌పీ చిరంజీవి, ఉపాధ్యాయులు సాయిరెడ్డి, సునిల్, వసుంధర, రమాదేవి, యామిలియా తదితరులు పాల్గొన్నారు.



మోడల్ అసెంబ్లీ నిర్వహిస్తున్న స్పీకర్

పెద్ద తడ్గూర్‌లో విద్యార్థుల మోడల్ అసెంబ్లీ

మద్నూర్, జనవరి 24: మండలంలోని పెద్ద తడ్గూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులచే మోడల్ అసెంబ్లీ నిర్వహించారు. విద్యార్థులు అధికార, ప్రతిపక్ష సభ్యులుగా మారి పలు ప్రశ్నలపై వాదోపవాదాలు వినిపించారు. రైతు సమస్యలు, మహిళా సమస్యలు, బస్సు సమస్యలపై చర్చించారు. బహిరంగంగా పొగ తాగడంపై నిషేధాన్ని ఆమోదించారు. ప్రధానోపాధ్యాయురాలు శ్యామల పట్టాబీ విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజనీ, గౌతం, బాల్‌రాజ్, సంతోష్, భుజంగ్, కాశీరాం, నోడల్ అధికారిగా మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు

ఉచిత సౌకర్యంతో ఉపాధి కోల్పోతున్నాం

కామారెడ్డి టౌన్, జనవరి 24: మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించడంతో ఉపాధి కోల్పోతున్నామని ఆటో యూనియన్ నాయకులు పేర్కొన్నారు. బుధవారం జిల్లా ఆటో యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని చర్చ్‌గ్రౌండ్ నుంచి పాత బస్టాండ్, నిజాంసాగర్ చౌరస్తా మీదుగా వెల్మ ఫంక్షన్‌హాల్ వరకు భారీగా ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మహాలక్ష్మి పథకం వల్ల ఆటో డ్రైవర్ల జీవితాలు రోడ్డున పడ్డాయని అన్నారు. రెక్కాడితే గాని డొక్క నిండని ఆటో డ్రైవర్ల కుటుంబాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్డున పడేలా చేసిందని ఆరోపించారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆటో డ్రైవర్లకు రూ.15వేల జీవనభృతి అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

అంజనీలో ఎండు గంజాయి పట్టివేత

పెద్ద కొడప్‌గల్, జనవరి 24: మండలంలోని అంజనీ గ్రామంలో బుధవారం బిచ్కుంద ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి 800 గ్రాముల ఎండు గంజాయి పట్టుకోవడంతో పాటు ఒకరిపై కేసు నమోదు చేసినట్లు బిచ్కుంద ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నర్మల హన్మండ్లు ఇంట్లో గంజాయి ఉందని తమకు సమాచారం రావడంతో అతని ఇంటిపై దాడి చేయగా 800 గ్రాముల ఎండు గంజాయి దొరికిందని తెలిపారు. దీంతో నర్మల హన్మండ్లుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. అంతేగాక బిచ్కుంద ఎక్సైజ్ పరిధిలో ఎవరైనా గంజాయి, మత్తు పదార్థాలు కలిగి ఉండటం, అమ్మడం నేరమని ఎవరైనా మత్తు పదార్థాలు అమ్మినా.. కొన్నా అటువంటి వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు ఉన్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి పేర్లు రహస్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ అభిషేక్, సిబ్బంది ఎల్లయ్య, పరుశురాం, నవీన్ రెడ్డి, శ్రీధర్, అనిత, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ

కామారెడ్డి టౌన్, జనవరి 24: కామారెడ్డిలోని శ్రీసాయిచారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాక్స్‌కేర్ క్లీనిక్ కార్యక్రమాన్ని కామారెడ్డిలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కామారెడ్డిలోని హెచ్ఐవీ బాధితులు పౌష్టికాహారంతో బాధపడుతున్న సుమారు 40 మంది హెచ్ఐవీ పాజిటివ్ బాధితులకు నెలరోజుల పాటు సరిపడే కిరాణ సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు ఎంజీ చక్రవర్తిగౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే మందులు సరిగా పని చేయాలంటే బలమైన ఆహారం కావాలి కాబట్టి వీరందరికీ ఆరోగ్యకరమైన కిరాణ సరుకులను సామాజిక బాధ్యతగా ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంధ సంస్థ కో ఆర్డినేటర్ రాణి, ట్రస్ట్ సభ్యులు భగత్, సుధాకర్, శ్రీనివాస్, ప్రభాకర్, నర్సింలు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



మద్నూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆడ పిల్లలను చదివించాలి

● సీడీపీవో సునంద

మద్నూర్, జనవరి 24: ప్రభుత్వం బేటీ పడావో, బేటీ బచావో కార్యక్రమం చేపట్టి గ్రామీణ ప్రాంతాల్లో బాలికలు చదువుకునే విధంగా పాఠశాలలు ఏర్పాటు చేస్తుందని ప్రతీ తల్లిదండ్రులు తమ ఆడ పిల్లలను చదివించాలని సీడీపీవో సునంద అన్నారు. బాలికల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలల్లో బాలికల చేత మొక్కలను నాటించారు. ఆడ పిల్లలు అన్ని రంగాల్లో ఎదిగే విధంగా తల్లిదండ్రులు గుర్తు చేయాలన్నారు. తల్లిదండ్రులచే తమ పిల్లలకు చదువు నేర్పిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కవిత, ఎంపీటీసీ సంగీతా, అంగన్‌వాడీ వర్కర్ రూపాబాయి, కళావతి, తదితరులు పాల్గొన్నారు.

వరి సాగులో మెలకువలు పాటించాలి



తలమడ్లలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

రాజంపేట, నవంబరు 24: మండలంలోని తలమడ్ల గ్రామంలో కామారెడ్డి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు అపర్ణ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాసంగి ప్రస్తుత వ్యవసాయ వాతావరణ పరిస్థితులు అలాగే సాగులో చేపట్టాల్సిన మెలకువల గురించి క్లుప్తంగా రైతులకు వివరించామన్నారు. మండలంలో ప్రధా నంగా యాసంగి సీజన్‌లో వరి, మొక్కజొన్న, శనగ, కూరగాయ పంటలను ప్రధానంగా సాగు చేస్తు న్న రైతులు ఉన్నారన్నారు. ముఖ్యంగా వరి పంటలు అక్కడక్కడ మోగి పురుగు కాండం తొలిచే పురుగు గమనించడం జరిగిందన్నారు. మోగి పురుగు గమనించిన వెంటనే కార్బోఫ్యూరన్ 3జీ గుళికలు ఒక ఎకరానికి 8-10 కిలోలు లేదా కార్టప్ హైడ్రోక్లోరైడ్ 50శాతం ఎస్‌పీ అనే మందును రెండు గ్రాములకు లీటర్ నీటిని కలిపి పొలం అంతా సమానంగా పిచికారీ చేయాలన్నారు. ముందుగా వేసిన వరి పొలంలో ఆకులపై చిన్నచిన్న గోధుమ వర్ణంలో బూడిద రంగు మచ్చలు గమనించామన్నారు. ఎరువుల యాజమాన్యం, కలుపుతీత క్రమక్రమంగా చేయడం వల్ల చీడపీడల ఉధృతి తగ్గుతుందని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు సాయిరెడ్డి, రవీందర్‌రెడ్డి, మధుసూదన్, వ్యవసాయ విస్తరణ అధికారులు మన్యుషా, శ్రీకాంత్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి	
దర్శన్	హనుమాన్
శాంతి	గుంటూరు కారం
ప్రియా 70	నా సామి రంగ
ప్రియా 35	సైందవ్

బాన్సువాడ	
మహేశ్వరి	గుంటూరు కారం
వెంకటేశ్వర	హనుమాన్



చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	100	160	180
వెన్‌కాబ్(కిలో)	100	180	210

